
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 కర్నూలు జిల్లా వార్తలు

శనివారం 29 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:35	4:53
నంద్యాల	6:32	4:53

ఈ అన్నం తినేదెలా..?



ముద్దగా మారిన అన్నం, నీళ్ల పప్పు

- మాడిపోయిన అన్నాన్ని పడేసిన విద్యార్థులు
- పాఠశాలలో తాగునీరు కరువు
- పట్టించుకోని ఉపాధ్యాయులు, అధికారులు

మంత్రాలయం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలకు వరంగా మారింది. విద్యార్థులు మాత్రం మాడిపోయి, సంకటి ముద్దగా మారిన ఇలాంటి అన్నం ఎవరైనా తింటారా? అని పారేస్తున్నారు. మంత్రాలయం మండలంలోని సూగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం వద్దు బాబోయ్.. ఈ అన్నం తినలేం.. అంటూ అనేక మంది విద్యార్థులు పడేశారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 9వరకు దాదాపు 500 మంది విద్యార్థులు ఉన్నారు. 14 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 6 గదులు మాత్రమే ఉన్నాయి. ఈ గదుల్లో తరగతులు నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో మధ్యాహ్న భోజనం పాఠశాల ప్రాంగణంలో చెట్ల కింద, ఎండకు వడగాలుల మధ్య వడ్డిస్తున్నారు. చెట్ల నీడలో, ఉపాధ్యాయుల మోటార్‌సైకిళ్లు, కుక్కల మధ్యనే నేలపై కూర్చొని తింటున్నారు. ఆకుకూరతో చేసిన నీళ్ల కూర తినలేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. రోజూ ఇలాంటి భోజనం తినలేక కొంత మంది విద్యార్థులు ఇంటికి వెళ్లితిని వస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని నిధులు వెచ్చిస్తున్నా, ఈ పాఠశాలలో మాత్రం నిబంధనలు, మెనూ పాటించడంలేదు. ఎండాకాలంలో గంటకు ఒకసారి తాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు తగిన ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి బాటిల్‌లో నీరు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. నాడు-నేడు కింద మంజూరైన ఆర్వో ప్లాంటు రిపేర్‌లో ఉంది. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వంట ఏజెన్సీ ఇష్టారాజ్యం నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యాహ్నం భోజన నిర్వహణ దుస్థితిని మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ భోజనం తినలేక పోతున్నాం

మాడిపోయి, ముద్దగా మారిన అన్నం, నీళ్ల ఆకుకూర తినలేకపోతున్నాం. ప్రతి రోజూ రుచిలేని ఈ భోజనం తినలేకపోతున్నాం. తాగడానికి నీళ్లు కూడా లేవు. ఇంటి నుంచి బాటిల్‌తో తెచ్చుకుంటున్నాం.

-ఓవిద్యార్థిని, 7వ తరగతి విద్యార్థిని

ఇక్కడ అన్నీ సమస్యలే.. నేనేమీ చేయలేను

ఈ పాఠశాలలో గదులు, నీరు, ప్రహరీ సమస్యలు ఉన్నాయి. రెగ్యులర్ హెచ్‌ఎం లచ్చప్ప 10వ తరగతి పరీక్షలకు చీఫ్ అధికారిగా వెళ్లారు. ఇక్కడ అన్నీ సమస్యలే ఉన్నాయి. నేనేమీ చేయలేను.



-వెంకటరాముడు, ఇన్‌చార్జి హెచ్‌ఎం, సూగూరు



విద్యార్థుల వద్దకు వచ్చిన శునకం



మాడిపోయిన అన్నం



విద్యార్థికి వడ్డించిన సంకటిగా మారిన అన్నం

వంట ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం



సూగూరు ప్రాథమిక, జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. మెనూ పాటిస్తూ ప్రతిరోజు తాగునీరు పాఠశాలలో ప్రత్యేకంగా నిల్వ ఉంచాలని ఆదేశాలున్నాయి. తాగునీరు ఉపాధ్యాయులు ఏర్పాటుచేయాలి. ఎండకు చెట్టుకింద విద్యార్థులకు భోజనం పెట్టడం సరికాదు.

- మైనుద్దీన్, ఎంఈఓ, మంత్రాలయం.

పత్తి ఓబులయ్యకు కళారత్న పురస్కారం

- ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉగాది రోజున సత్కరించనున్న సీఎం చంద్రబాబు



కర్నూలు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కళారంగంలో సుప్రసిద్ధ కళాకారులకు రాష్ట్ర స్థాయిలో ఏటా ఉగాది రోజున ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక కళారత్న(హంస) పురస్కారానికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జున శుక్రవారం రాత్రి తెలియజేశారు. ఈ పురస్కారం కింద కళారత్న బిరుదుతోపాటు, హంస విగ్రహంతో సత్కరిస్తారు. అలాగే రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం కూడా ఇస్తారు. 30న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఓబులయ్యను అవార్డుతో సత్కరిస్తారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఉగాది హంస పురస్కారానికి ఎంపికైన పత్తి ఓబులయ్య గత 50 ఏళ్లకు పైగా నాటక రంగానికి వివిధ రూపాల్లో సేవలు అందిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా తొలి హంస పురస్కారానికి ఎంపికైన తొలి జిల్లా కళాకారుడిగా నిలిచారు. పత్తి ఓబులయ్యకు కళారత్న (హంస) పురస్కారం లభించిన సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం కళాకారులతోపాటూ, జిల్లాకు చెందిన వివిధ కళాసంస్థల ప్రతినిధులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ

కర్నూలు అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యార్థులకు నీట్, ఏపీ సెట్-2025 ఎంట్రన్స్ రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్‌సీఈడీఎం డిప్యూటీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29 నుంచి ఏప్రిల్ 5 లోపు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ముస్లింలు, దూదేకుల, నూర్ బాషా, క్రైస్తవులు సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్సీ తెగల అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు 9441761178కు సంప్రదించాలని తెలిపారు.

కైలాస వాహనంపై శ్రీశైలేశుడు



క్షేత్రవీధుల్లో కొనసాగుతున్న స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీశైలం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసం శ్రీశైలం క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై విహరించారు. మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవానికి ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబైన కైలాస వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు అర్చనలు, హారతిపూజలు నిర్వహించారు.

రెండు ఓకే.. మిగతావి...?

- మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ఎంపిక
- ఎమ్మిగనూరుకు కురవ మల్లయ్య, పత్తికొండకు నబీసాహెబ్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కర్నూలు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు చైర్మన్ల ఎంపికపై సస్పెన్స్



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు

కర్నూలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాల ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ యార్డులకు చైర్మన్లను ఎంపిక చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా కురవ మల్లయ్య, పత్తికొండ మార్కెట్ చైర్మన్‌గా ఎస్.నబీసాహెబ్ నియమితులయ్యారు. అయితే కీలకమైన కర్నూలు, ఆదోని మార్కెట్ యార్డులతో పాటు కోడుమూరు, ఆలూరు, మంత్రాలయం మార్కెట్ యార్డులకు చైర్మన్లను ఎంపిక చేయాల్సి ఉంది. గత జనవరిలోనే రిజర్వేషన్ల ప్రకారం మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు సహా డైరెక్టర్ల జాబితాతో ఆయా ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు లేఖలు పంపారు. వాస్తవంగా సంక్రాంతి నాటికే నూతన పాలకవర్గం ఎంపిక ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో పలువురు ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ బలోపేతం కోసం పని చేసిన నాయకులను విస్మరించి.. అధికారం వచ్చాక టీడీపీలో చేరి పెత్తనం చెలాయించే వైసీపీ నాయకులు, వారి బంధువుల పేర్లను సిఫారసు చేశారంటూ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు వివిధ జిల్లాల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) ద్వారా కార్యకర్తలకు వాయిస్ మెసెజ్ పంపి.. వారి అభిప్రాయాలు తీసుకున్న తరువాత వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.



కురవ మల్లయ్య

ఎమ్మినూరు మార్కెట్ చైర్మన్‌గా మల్లయ్య:

జిల్లాలో ప్రధాన వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఒకటైన ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా గోనేగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురవ మల్లయ్యను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీరిది స్వతహాగా వ్యవసాయ కుటుంబం. కురవ సామాజికవర్గానికి చెందిన నాయకుడు. వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకం, రసాయన ఎరువుల వ్యాపారం చేస్తుంటారు. వైసీపీలో ఉన్న మల్లయ్య పార్టీ విధానాలు నచ్చక అసెంబ్లీ ఎన్నికల ముందే పార్టీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అప్పటి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న కురబ/కురవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చిన మంత్రి సవిత సమక్షంలో ఎమ్మెల్యే బీవీ వెల్లడించారు. ఆ మేరకు మల్లయ్యకు చైర్మన్ పదవి ఇచ్చారు.

విశ్వసనీయతకు పత్తికొండ స్థానం

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం కృష్ణగిరి మండలం అలంకొండ గ్రామానికి చెందిన ఎస్.నబీసాహెబ్‌ను వరించింది. నబీసాహెబ్ కుటుంబం మొదటి నుంచి మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కుటుంబానికి విశ్వాసపాత్రుడుగా ఉంటున్నారు. పెద్దాయన కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా, మంత్రి, డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు, ఆయన సోదరుడు కేఈ ప్రభాకర్ మంత్రిగా ఉన్నప్పుడు వారివెంటే ఉన్నారు. పత్తికొండ మార్కెట్ చైర్మన్ పీఠం కోసం ఎందరో పోటీ పడినా అలంకొండ నబీసాహెబ్ వైపే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నిలిచారు.



పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు



పత్తికొండ మార్కెట్ చైర్మన్‌గా ఎంపికైన ఎస్.నబీసాహెబ్

ఆ ఐదు స్థానాల ఎంపిక ఎప్పుడో?

కర్నూలు, ఆదోని, కోడుమూరు, ఆలూరు, మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్లను ఎంపిక చేయాల్సి ఉంది. కర్నూలు మార్కెట్ పీఠం కోసం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఆర్.చంద్రకలధర్‌రెడ్డిని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఆలూరు చైర్మన్ పీఠం కోసం పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు తమ్ముడు త్యాగరాజుతో పాటు మరో ఆరుగురు ఆశిస్తున్నారు. ఆదోని పీఠం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పోటీ పడుతున్నారు. మంత్రాలయం, కోడుమూరు మార్కెట్ యార్డుల చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదని సమాచారం.

● బీవీ నమ్మకాన్ని వమ్ముచేయను

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నాపై ఎంతో నమ్మకంతో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఓ రైతుగా మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తాను. నాకు ఎమ్మెల్యే బీవీ ఇచ్చిన గుర్తింపు జీవితంలో మరవలేనిది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో చైర్మన్‌గా నా పేరు చూసి సంతోషంతో ఉప్పొంగిపోయాం. మా కుటుంబం బీవీ కుటుంబానికి రుణపడి ఉంటుంది.

- కురవ మల్లయ్య, ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్

కన్నడిగులకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహానంది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం పురస్కరించుకొని మహానంది ఆలయాన్ని దర్శించే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దైవదర్శనం కోసం మహానందికి వచ్చే కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులకు క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలపై ఈఓతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఉగాదికి వచ్చే భక్తుల అంచనా వేశారా?

జవాబు: దాదాపు లక్షమంది కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు మహానందీశ్వరుని దర్శనం కోసం ఒక్క ఉగాది పర్వదినం రోజు వస్తారని అంచనా. వేశాం. ఇందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: ఉచిత దర్శనం అమలు చేస్తారా?

జవాబు: ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. నిరంతరం అమలు చేస్తాం.

ప్రశ్న: దర్శనం కోసం క్యూలో ఉండే భక్తులకు ఏవిధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

జవాబు: స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉండే భక్తుల కోసం ఉచితంగా వాటర్ బాటిళ్ళు, ఫ్రూట్స్, మజ్జిగ పంపిణీ చేస్తాం.

ప్రశ్న: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారా?

జవాబు: దేవస్థానం విస్తీర్ణం 55 ఎకరాలు ఉండటంతో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎక్కడ ఎలాంటి అపరి శుభ్రత లేకుండా ఉండేందుకు కోసం ప్రస్తుతం ఉన్న పారిశుధ్య సిబ్బందికి తోడు మరో పదిమంది తాత్కాలికంగా కార్మికులను నియమించి అపరిశుభ్రత లేకుండా చేస్తాం.

ప్రశ్న: ఉగాది పర్వదినం సందర్భంగా క్షేత్రంలో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

జవాబు: వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ఆలయ పరిసరాల్లో భక్తులు ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు గ్రీన్ మ్యాట్లు, షామియానాలు, భక్తుల పాదాల రక్షణ కోసం మ్యాట్లతో పాటు తాగునీరు ఏర్పాటు చేశాం. లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచాం. విడిది కోసం దేవస్థానం ఎదుట టీటీడీ కల్యాణ మండపం, పోచా విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తెచ్చాం. అలాగే భక్తులు వాహనాలు నిలిపేందుకు దేవస్థానానికి చెందిన 17 ఎకరాల్లో పార్కింగ్ స్థలం కేటాయించాం.

ప్రశ్న: దర్శనం ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు?

జవాబు: కన్నడ భక్తులకు దర్శనం సమయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉగాది రోజు పూర్తి స్థాయిలో నిరంతరం దర్శనం ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మధ్యాహ్నం సమయంలో నివేదన తర్వాత రాత్రి 10 గంటల వరకు అమలు చేస్తున్నాం. అలాగే తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తున్నాం. ఉగాదిరోజున పంచాంగ శ్రవణం ఉంటుంది.



నియోజకవర్గాల పునర్విభజన వాయిదా వేయాలి

జేవీవీ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నియోజిక వర్గాల పునర్విభజన అంశాన్ని మరో పాతికేళ్లకు వాయిదా వేయాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, జేవీవీ ఆధ్వర్యంలో 'డీలిమిటేషన్ వరమా ? శాపమా?' అనే అంశంపై సదస్సు జరిగింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి, విశ్రాంత రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు సి. రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 84వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 2026లో నియో జకవర్గాల పునర్విభజన కేంద్ర ప్రభుత్వం చేపట్టనుందని అన్నారు. అదే జరిగితే ప్రస్తుత దేశ జనాభా ఉజ్జాయింపు లెక్కల ప్రకారం ఉన్న లోక్‌సభ సీట్లు 543 అలాగే ఉంచినప్పటికీ యూపీ లోక్‌సభ సీట్లు 80 నుంచీ 92కు, బీహార్‌లో 40 నుచీ 50 పెంచాల్సి ఉంటుందని అన్నారు. ఇంకోవైపు ఏపీలో సీట్లు 25 నుంచి 20 తగ్గితే, తెలంగాణలో 17 నుంచి 15కు, తమిళనాడులో 39 నుంచీ 32కు, కేరళలో 20 నుంచీ 14కు తగ్గే అవ కాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి ప్రతాప రెడ్డి, రాష్ట్ర నాయకుడు గజల్ మహమ్మద్ మియా, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మన్సూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ సందడి

రంజాన్ ప్రత్యేకం

- టోపీలు, ఖురాన్ గ్రంథాల కొనుగోలు సందడి
- సాయంత్రం వేళల్లో కళకళలాడుతున్న దుకాణాలు



దుకాణంలో అత్తర్ సీసాలు

కర్నూలు కల్చరల్/నంద్యాల కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అత్యంత ప్రీతికరమైన రంజాన్ మాసాన్ని భక్తి భావనలతో కొనసాగిస్తున్నారు. నిత్యం ఐదు పూటల నమాజ్‌లతోపాటూ రాత్రి వేళల్లో ప్రత్యేక తరావీహ్ నమాజ్‌లను ఆచరిస్తూ ఖురాన్ గ్రంథం పఠనం పూర్తి చేస్తున్నారు. మరోవైపు రంజాన్ మాసం సందర్భంగా వస్త్ర, పాదరక్షలు, టోపీలు, ఖురాన్ గ్రంథాలు, అత్తర్లు, సుర్మాలు వంటి వాటిని కొనుగోలు చేస్తున్నారు. కర్నూలు పాతనగరంలోని గడియారం ఆసుపత్రి, పూలబజార్, పెద్ద మార్కెట్, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో రంజాన్ మాసం సందర్భంగా ఆయా దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి. అదేవిధంగా నంద్యాల పట్టణంలోని బైర్‌మల్‌వీధిలో వ్యాపారాలు జోరందుకున్నాయి. రంజాన్ పండుగకు మరో మూడు రోజుల సమయమే ఉండటంతో ముస్లింలు ఉత్సాహంగా వాటిని కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ఎండ తీవ్రత బాగా ఉండటం, పగలంతా ఉపవాసం పాటిస్తూ ఉండటం వల్ల, సాయంత్రం ఇఫ్తార్ వేళ తర్వాత షాపింగ్ చేసేందుకు ముస్లింలు బారులు తీరుతున్నారు.

విభిన్న టోపీలు : ముస్లింలు ప్రార్థనల సమయంలో టోపీలు తప్పనిసరి. ఈ తెల్లటి స్కల్ క్యాప్‌ల ధర రూ.50 నుంచి ప్రారంభమవుతుంది. డిజైన్లతో కూడినవి రూ.100 నుంచీ రూ.250 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రార్థన మ్యాట్‌లతో కూడిన రుమాలు, లేదా హాజీ రుమాళ్లు చాలా ట్రెండీగా మారాయి. తక్కువ ధర కారణంగా పురుషులు కొత్త కొత్త టోపీలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడతారు.





విక్రయానికి సిద్ధంగా ఉన్న టోపీలు

ఖురాన్ గ్రంథాలు ప్రత్యేకం: రంజాన్ మాసంలో ఖురాన్ గ్రంథాలు అందుబాటులో లభిస్తున్నాయి. ఈ మాసంలో విరివిగా లభించే గ్రంథాలను ఖరీదు ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఈ గ్రంథాలను బహుమతి రూపంగానూ కొందరు అందజేస్తున్నారు. ఒకప్పుడు అరబిక్ బాషలోనే లభించే ఖురాన్ గ్రంథాలు నేడు ఆంగ్ల, తెలుగు భాషల్లోనూ లభిస్తున్నాయి. దీంతో అన్ని మాధ్యమాల వారు సులువుగా అర్థం చేసుకుని ఖురాన్ గ్రంథాన్ని పఠించే అవకాశం లభిస్తోందని పెద్దమార్కెట్ సమీపంలోని దీని బుక్ డిపో యజమాని మహమ్మద్ యూసుఫ్ తెలిపారు.



నేత్రాలకు రక్ష సుర్మా : రంజాన్ మాసంలో కళ్లకు సుర్మా పెట్టుకోవడం ఒక సంప్రదాయం. ఇది కంటికి చల్లదనంతోపాటూ దృష్టిని పెంచుతుందని పెద్దలు చెబుతారు. ఈ మాసంలో సుర్మాల విక్రయాలు బాగా ఉంటాయి. అలాగే ముస్లిం పెద్దలు దైవ ధ్యానంలో ఉన్నప్పుడు తస్బీలు చేతిలో ధరిస్తారు. వాటి పూసలను తిప్పుతూ ధ్యానం పాటిస్తారు. ఈ మాసంలో విభిన్న రంగుల్లో, డిజైన్లలో తస్బీలు కూడా లభిస్తున్నాయి.

వర్ణాలు... పరిమళాలు : అత్తర్, పెర్ఫ్యూమ్‌లలో స్వచ్ఛమైన పువ్వులు, గంధపుచెక్కలు వంటివి ఉపయోగించి తయారు చేస్తుంటారు. వీటిలో జన్నతుల్, ఫిరదోస్, మజ్మా, షాజహాన్, తమన్నా, నాయబ్, బకూర్, మెకల్లత్, ఖస్, జాఫ్రాన్ తదితర రకాలు మార్కెట్లో లభిస్తున్నాయి. ఆల్కాహాల్ లేని అత్తర్లను ఎంపిక చేసుకోవడంలో ముస్లింలు ఆసక్తి చూపిస్తారు. అసలైన అత్తర్లు ఉపయోగించే వారి దుస్తులు కూడా రెండు మూడు పర్యాయాలు ఉతికినా వాటి వాసన అలాగే ఉంటూ పరిమళాలు వెదజల్లుతుంటాయి.



కర్నూలు పాతబస్తీలోని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ముస్లింలు

ఉగాది ఉత్సవాలకు ముస్తాబు

- అనాదిగా ఎద్దులబండ్లు, గాడిదల ప్రదక్షిణ
- ఆలయం చుట్టూ బురదమట్టి
- చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి





కల్లూరులోని అమ్మవారి ఆలయం చుట్టూ నీటితో నింపిన నిర్వాహకులు

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో కొలువైన చౌడేశ్వరీదేవి ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. ఈమేరకు కార్యనిర్వాహక అధికారి గుర్రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరులోని అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ వసంత రాత్రి దీపోత్సవాలు (జ్యోతులు) ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆనాదిగా చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టు ఉగాది పండుగ నాడు ఎద్దులబండ్లు, గాడిదలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఈ అరుదైన వేడుకను చూసేందుకు ప్రజలు, భక్తులు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివస్తారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు: ఉగాది పండుగను పురస్కరించుకుని చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి మహోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈనెల 30న ఆదివారం అర్ధరాత్రి నుంచి భక్తులు తయారుచేసిన జ్యోతులతో కల్లూరు ఊరువాకిలి నుంచి ఊరేగింపుగా తరలివచ్చి సోమవారం ఉదయం కల్లూరులోని చౌడేశ్వరీ అమ్మవారికి సమర్పిస్తారు. అదేవిధంగా 31న కూడా అమ్మవారికి జ్యోతులను సమర్పించి మొక్కులను తీర్చుకుంటారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు ఉగాది వేడుకల్లో భాగంగా అమ్మవారి ఆలయం చుట్టూ మట్టితీసి బురదతో నింపారు.



ఆట వస్తువులు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు
- మంత్రి టీజీ భరత్
- 'మీ సమస్య - మా పరిష్కారం' కార్యక్రమానికి శ్రీకారం
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా సహా వివిధ శాఖల అధికారులు హాజరు



వినతులు స్వీకరిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గుర్తించి తక్షణం పరిష్కరించడమే లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూ లు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణ పరి ష్కారం చూపాలనే ఆశయంలో 'మీ సమస్య - మా పరిష్కారం' సరికొత్త కార్యక్రమానికి స్థానిక శ్రీఆర్య ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ పి. రంజిత్‌బాషాతో మంత్రి టీజీ శుక్రవారం శ్రీకారం చుట్టారు. కర్నూలు నగరపాలక సంస్థ అధికారులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై 144 మందికి పైగా వినతి పత్రాలు ఇచ్చారు. మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్‌బాషా ప్రజలు వినతులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లా డుతూ ప్రజలు మధ్యలో ఉంటూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్, ఎస్పీల అధ్యక్షతన ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతలు స్వీకరించి పరిష్క రిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళ్యం సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో, నందికొట్కూరు రోడ్డులోని వరసిద్ధి వినాయక దేవస్థానం కల్యాణ మంటపంలో నిర్వహించిన 'ఉగాది' కవి సమ్మేళనం అసాంతం అలరింపజేసింది. విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కవి సమ్మేళనానికి తెలుగు కళ్యం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి అధ్యక్షత వహించగా, సమన్వయ కర్తగా అరసం నగర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం. హరికిషన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వెంకట రాజారెడ్డి మాట్లాడుతూ తెలుగు వారికి అత్యంత ముఖ్యమైన ఉగాది పండుగను పురస్కరించుకొని ఏటా కవి సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ ఔత్సాహిక కవులను తగిన రీతిలో సత్కరిస్తున్నామని చెప్పారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మాజీ సైనికుడైతే మాకేం?

- భూమి రికార్డులు తారుమారు చేసిన అధికారులు
- ఏడాదిగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న డి. గోవింద్‌రెడ్డి
- స్పందించని అధికారులు

కర్నూలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆయన దేశ రక్షణ కోసం సైన్యం (సీఆర్‌పీఎ్ ఫ)లో పని చేశారు. పదవి విరమణ సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన సాగు భూమి ఆధారంగా 20 ఏళ్లుగా జీవిస్తున్నారు. ఆ భూమి రికార్డులను రెవిన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మార్చేశారు. అయ్యా..! నేనో మాజీ సైనికుడిని.. నా భూమి రికార్డులు సరిచేసి న్యాయం చేయమని ఏడాదిగా రెవిన్యూ అధికారులు చుట్టూ ఆయన తిరుగుతున్నా కనికరించడం లేదు. హొళగుంద మండలం హొన్నూరు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు డి. గోవిందరెడ్డి కన్నీటి వేదన ఇది. మండలంలోని హొన్నూరు గ్రామానికి చెందిన డి. కాంతరెడ్డి కుమారుడు డి. గోవిందరెడ్డి 1993 ఏప్రిల్ 24న సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా చేరారు. పదేళ్లకు పైగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో దేశ రక్షణ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల రక్షణలో పని చేశారు. 2013 నవంబరు 1న పదవి విరమణ చేశారు. కేంద్ర హోం శాఖ సిఫారసు మేరకు రెవెన్యూ అధికారులు హొన్నూరు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నం.32/బీలో 5 ఎకరాలు డీ-పట్టా ఇచ్చారు. 2004 ఏప్రిల్ 2న ఖాతా నంబరు.245 కింద హొళగుంద మండలం తహసీల్దారు పట్టాదారు పాసుపుస్తకం కూడా ఇచ్చారు. ఐబీ, ఆర్‌ఓఆర్, అడంగ్.. తదితర రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో డి. గోవిందరెడ్డి పేరు నమోదు చేశారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బు దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి ఆ భూమిలో రాళ్లు తొలగించి, చదును చేసి సాగు భూమిగా అభివృద్ధి చేసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో మామిడి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఆ పంట కోసం ఎస్‌బీఐ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది ఏప్రిల్ నెలలో ఆయనకు తెలియకుండా ఆన్‌లైన్ రికార్డులు మార్చేసి, ఈ భూమిని ఎవరికీ కేటాయించని ప్రభుత్వ భూమిగా చూపించారు. హొళగుంద మండల తహసీల్దారు, హొన్నూరు వీఆర్‌ఓ టి. సురంజనేయులను కలసి ఆయన తన భూమి రికార్డులు సరిచేసి న్యాయం చేయాలని కోరారు. తన వద్ద ఉన్న రికార్డులు చూపించారు. ఏడాది కావస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్లకు విన్నవించారు. అయినా ఫలితం శూన్యం.





హొళగుంద మండలం హొన్నూరులో 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూమిలో మామిడి సాగు చేస్తున్న మాజీ సైనికుడు డి.గోవిందరెడ్డి

ఆన్‌లైన్ రికార్డులు సరిచేసి న్యాయం చేయండి



సీఎస్ఆర్ఎఫ్ జవాన్‌గా పదేళ్లు పని చేస్తే.. ప్రభుత్వం జీవనాధారం కోసం 20ఏళ్ల క్రితం 5 ఎకరాల సాగు భూమి ఇచ్చింది. ఏడాది క్రితం ఆన్‌రికార్డులు మార్చేశారు. అన్ని రకాల రాకార్డులు చూపించాను. అయినా నాపై కనికరం చూపడం లేదు. పీజీఆర్ఎస్‌లో పది సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఆన్‌లైన్ రికార్డులు సరిచేసి న్యాయం చేయాలి.

- డి. గోవిందరెడ్డి, మాజీ సైనికుడు, హొన్నూరు గ్రామం, హొళగుంద మండలం:

వీఆర్వో, టీడీపీ నాయకుడి మధ్య ఘర్షణ

● గాయపడ్డ వీఆర్వో వెంకటేశ్వర్లు


గాయపడ్డ వీఆర్వో వెంకటేశ్వర్లు

సి.బెళగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఒకటవ వీఆర్వో వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు ఆదిత్యరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. మిగులు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. ఇది గమనించిన పక్కన ఉన్న రైతులు ఇద్దరినీ విడిపించారు. గాయపడ్డ వీఆర్వోను మండలంలోని వీఆర్వోలందరూ కలిసి చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తంను వివరణ కోరగా వీఆర్వోపై ఘర్షణ జరిగిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కర్నూలు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వామిరెడ్డనగర్‌లో ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. రెండు నెలల క్రింద స్వామిరెడ్డినగర్‌లో నివాసముంటున్న కోటమ్మ అనే మహిళ ఇంటికి ఓ మహిళ వచ్చారు. తన పేరు షాహీనా అని, తాను అనాథను అని, ఓ పది రోజులు ఇల్లు బాడుగ ఇస్తే ఏదైనా పని చూసుకుని వెళ్లిపోతానని ప్రాధేయపడ్డారు దీంతో కోటమ్మ అనే మహిళ ఆమెకు ఇంటిని అద్దెకి ఇచ్చారు. అయితే కోటమ్మ భర్త అనారోగ్యం వల్ల తరుచూ నెల్లూరు వెళ్లి వస్తున్నారు. దీంతో అద్దెకు దిగిన మహిళ గురించి పెద్దగా పట్టించుకోలేదు. శుక్రవారం ఆ మహిళ ఉంటున్న ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తలుపులు పగులకొట్టి చూస్తే లోపల గుర్తు తెలియని మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. మృతురాలి శరీరంపై, కుడిచేతిపైన లాజర్ అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆచూకి తెలిసిన వారు త్రీటౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ శేషయ్య తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టును చూపిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ దొంగతనం కేసుకు సంబంధించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాము శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద గల ఓ బీరువాల దుకాణంలో ఈ నెల 25న రాత్రి గాయబ్ అనే వ్యక్తి నిద్రిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆయన వద్దకు వచ్చి కడియంతో గాయపరిచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.50 దోచుకున్నట్లు తెలిపారు. దీంతో బాధితుడు కేకలు వేయడంతో ఇద్దరు దొంగలు బైక్‌పై పరారయ్యారని చెప్పారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బందిపోటు దొంగతనం కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో ఆత్మకూరు పట్టణానికి చెందిన ముర్తుజావలి, రమణ అనే ఇద్దరు దొంగలను పట్టణ శివార్లలోని ఉర్దూ స్కూల్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైకును, కడియాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్సై నారాయణరెడ్డి, సిబ్బంది రవి, శివరామ్, లక్ష్మణ్, వెంకటస్వామి, రంగస్వామి, అమీర్ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఉప లోకాయుక్త అండ

కర్నూలు లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిడుగుపాటుకు మృతి చెందిన బాధితుల కుటుంబాలకు రాష్ట్ర లోకాయుక్త అండగా ఉంటుందని ఉప లోకాయుక్త పి. రజని తెలియజేశారు. చిత్తూరు జిల్లా పిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం. వరలక్ష్మి భర్త ఎం. రామకృష్ణ పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతుడి భార్య ఎం.వరలక్ష్మి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద ఎక్స్‌గ్రేషియా సహాయం కోసం దరఖాస్తు చేసుకుంది. ఎక్స్‌గ్రేషియా అందకపోవడంతో ఆమె ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి ఎక్స్‌గ్రేషియా చెల్లించే విషయాన్ని పరిశీలించాలని ఆదేశించింది. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ బాధితురాలికి రూ.12 లక్షలు అందజేశారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

వెలుగోడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అనుమానంతో ఓ వ్యక్తి భార్యను గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన ఘటన శుక్రవారం వెలుగోడు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని మోతుకూరు గ్రామ మజార గ్రామమైన తిమ్మనపల్లిలో ఇస్కాల చిన్న మధుకృష్ణ తన భార్య లక్ష్మీదేవి(35)పై అనుమానం పెంచుకొని ఇంటి వద్ద గొడవ పడ్డాడు. ఆమెపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. మృతురాలు తల్లి వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

దేవనకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై తెర్నేకల్ గ్రామానికి చెందిన గిరిపోగు ప్రతాప్ (30)అనే యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ముకెన్న, మునెమ్మ దంపతుల రెండో కుమారుడు ప్రతాప్ గ్రామంలో ఎలక్ట్రికల్, సప్లయర్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం జరిగిన గ్రామసభకు టెంట్ ఏర్పాటు చేశారు. సభ ముగిశాక సాయంత్రం టెంట్ పైపులు కిందకు దించుతున్న క్రమంలో పైనవున్న విద్యుత్ తీగను గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురై, పైనుండి కిందపడ్డాడు. ప్రతాప్‌కు తల పగలడంతో వైద్యం కోసం అంబులెన్స్‌లో దేవనకొండ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యం బొలెరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకొని అందులో ఉన్న డ్రైవర్ ఇందన్న, షేక్షవలిను అరెస్టు చేసినట్లు ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. బోలోరోలో ఉన్న వాహనంలో ఉన్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నహుల్తి, దేవనబండలలో చోరీలు

పత్తికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహుల్తి, దేవనబండ గ్రామాలలో మూడు ఇళ్లలో చోరీలు జరిగాయి. చిన్నహుల్తిలో వీరన్న ఇంటిలో 40వేలు నగదు 1.6గ్రాములు చోరీకి గురికాగా దేవనబండలో రంగన్న ఇంటిలో 40తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

పత్తికొండ గత ఈవో క్రిష్ణకుమార్‌పై చర్యలు

- సిబ్బంది జీతభత్యాలలో అవినీతి ఆరోపణలపై ఉత్తర్వులు

పత్తికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా గతంలో పనిచేసిన క్రిష్ణకుమార్‌ను విధుల నుండి తొలగిస్తూ శుక్రవారం పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా పనిచేస్తున్న సమయంలో సిబ్బంది జీతాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని రూ 1,33,27,673 విడుదల కాగా అందులో రూ 74,63,845 ఒకే వర్కర్ ఖాతాకు బదిలీ చేశారు. జీవో ఎంఎస్ నెం 432 పీఆర్ అండ్ ఆర్‌డీ 31.01.2013 నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా పామిడి ఈవోఆర్డీగా ఆయన విధులు నిర్వహిస్తున్నాడు.

పదోన్నతుల కోసం పడిగాపులు

● ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడంతో సిబ్బందిపై పనిభారం
● కర్నూలు మార్కెట్‌యార్డులో వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట ఏదీ..?


కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధిక పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పదోన్నతుల కోసం అధికారులు, సిబ్బంది సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. మరోవైపు పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో పనిభారం కొండలా పేరుకుపోతోందని అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారుల అక్రమాలను కట్టడి చేయడంలో అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. రైతుల పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర అందించడంతో పాటు వ్యాపారుల అక్రమాలను అరికట్టడానికి అవసరమైన అధికారులు సిబ్బంది లేకపోతే ఎలా? అని కర్నూలు మార్కెట్ కమిటీ యంత్రాంగం ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఏటా ఈ మార్కెట్ కమిటికి పంట ఉత్పత్తుల విక్రయాలతో పాటు షాపుల అద్దె రూపేణా దాదాపు రూ.7 కోట్ల దాకా ఆదాయం వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే మార్కెట్ కమిటీలలో కర్నూలు మొదటి స్థానంలో నిలిచింది. కనీసం క్రయ విక్రయాలు ప్రతిరోజూ జరిగే మార్కెట్ కమిటీల్లోనైనా అధికారులను సిబ్బందిని నియమించడంలో మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదని, దీని వల్ల తాము నష్టపోతున్నామనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీలో ఒక సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీతో పాటు గ్రేడ్-1, 2 సెక్రటరీలు, అలాగే అసిస్టెంట్ సెక్రటరీలు ఇద్దరు ఉండాలి. ప్రస్తుతం గ్రేడ్-1 సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులు రెండు ఉండగా.. ఒక పోస్టులో ఉన్న అధికారిని పాణ్యం మార్కెట్ కమిటీకి డిప్యూటేషన్‌పై పంపారు. పాణ్యం మార్కెట్ కమిటీ యార్డులో పంట ఉత్పత్తుల విక్రయాలు జరగడం లేదు. అటువంటప్పుడు అక్కడకు కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి పంపాల్సిన అత్యవసర పని ఏముందో ఉన్నతాధికారులకే తెలియాలని పలవురు అంటున్నారు. అలాగే సూపర్‌వైజర్లు పది మంది ఉండాల్సి ఉండగా.. కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారు కూడా పదోన్నతులు లభిస్తే అసిస్టెంట్ సెక్రటరీలుగా పక్క మార్కెట్ కమిటీలకు వెళ్లేందుకు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేశవరెడ్డి, శివన్న, నాగేష్, సూపర్‌వైజర్లు అసిస్టెంట్ సెక్రటరీలుగా ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా పదోన్నతులు లభించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు సీనియారిటీ జాబితాలో ఉన్న అసిస్టెంట్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.600 కోట్లు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మెరుగైన రహదారులకు రూ.600 కోట్లు కేటాయించినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన రహదారులు, రాష్ట్ర ప్రధాన హైవేలల పథకం కింద రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.861 కోట్లతో సుమారు 20వేల కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన రహదారులకు సంబంధించి 64 నియోజకవర్గాల్లో 86 పనులు చేపట్టి రూ.200 కోట్లతో 536 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో హైవేలకు సంబంధించి 99 నియోజకవర్గాల్లో 139 పనులు చేపట్టి రూ.400 కోట్ల వ్యయంతో 896.41 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మొత్తంగా 225 పనులకు రూ.600 కోట్లతో 1432.41 కిలో మీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 5 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో రోడ్లకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్ద ఎత్తున రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బీసీ జనార్దన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా టీడీపీ కార్యకర్తలు 63 వేల వరకు రికార్డు స్థాయిలో సభ్యత్వం చేశారన్నారు. మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీ కోటిమంది సభ్యత్వాలు నమోదు చేసిన ఘనత టీడీపీ యువ నాయకుడు లోకేశ్‌కే దక్కుతుందని అన్నారు. టీడీపీ నాయకులు అంబాల రామకృష్ణారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, పెండేకంటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మానుష్యంగా మారిన అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారి


ఎండలకు నిర్మానుష్యంగా మారిన కొలిమిగుండ్ల శాంతినగర్ వీధి

సూర్య ప్రతాపం

● పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
● ఆర్టీసీ, పర్యాటక శాఖలకు ఎండదెబ్బ
● తగ్గిన బెలుం గుహల ఆదాయం


పర్యాటకులు లేక వెలవెల బోతున్న బెలుం గుహల్లోకి ప్రవేశించే ప్రాంతం

కొలిమిగుండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రోజు రోజుకీ సూర్య ప్రతాపం అధికమవుతుండటంతో ప్రజలు పది దాటితే ఇంటికే పరిమితమవుతున్నారు. మరోవైపు ఎండల దెబ్బకు జన సంచారం తగ్గిపోవడంతో ఆర్టీసీ, పర్యాటక శాఖల ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు బెంబెలెత్తారు. దీంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానీయాల కోసం పరుగులు తీస్తున్నారు. మరోవైపు మధ్యాహ్నం అయితే చాలు ప్రధాన రహదారులు, వీధులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో విద్యార్థులు ఎండల ధాటికి హడలిపోతున్నారు.

బెలుం గుహలకు తగ్గిన ఆదాయం

ఎండలు, ఉక్కపోత కారణంగా ప్రముఖ పర్యాటక కేంద్రం, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద పొడవైన గుహలుగా పేరుగాంచిన బెలుం గుహలు సందర్శకులు లేక వెలవెలబోతున్నాయి. గత కొద్ది రోజులుగా తీవ్రంగా మారిన ఎండ దెబ్బ టూరిజం శాఖ ఆదాయానికి గండి కొడుతోంది. ఓవైపు ఎండలు, మరోవైపు విద్యార్థుల పది పరీక్షల కారణంగా బెలుం గుహలకు పర్యాటకుల తాకిడి పూర్తిగా తగ్గిపోయింది. ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే ఎండలు భారీగా పెరిగాయి. రెండు రోజులుగా నంద్యాల జిల్లాతో పాటు, కొలిమిగుండ్ల మండలంలో 42డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు కొలిమిగుండ్ల మండలం మైనింగ్ ప్రాంతం కావడంతో భూమిలో వేడి మరింత అధికంగా ఉంటోంది. దీంతో ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే ఉష్ణోగ్రత్తలు కాస్త అధికంగానే నమోదవుతున్నాయి. మండుతున్న ఎండలతో పర్యాటకుల తాకిడి తగ్గి బెలుం గుహలకు ఆదాయం తగ్గినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో రోజూ రూ.30 నుండి రూ.50, లక్ష రూపాయల వరకు ఆదాయం సమకూరేవి. కానీ వేసవి కారణంగా బెలుం గుహలకు ప్రస్తుతం రోజుకు రూ.10వేలకు మించడం ఆదాయం రావడం లేదు. మార్చి నెలలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఆదాయం మరింతగా తగ్గే ప్రమాదం ఉంది.


ఎగసిపడుతున్న మంటలు

లీకైన గ్యాస్.. త్రుటిలో తప్పిన ప్రమాదం

హొళగుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండల పరిధిలోని గజ్జెహల్లి గ్రామంలో శుక్రవారం బాషా అనే వ్యక్తికి చెందిన హోటల్‌లో ఉదయం 9 గంటల ప్రాంతంలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్‌కు ఉన్న పైప్ నుంచి గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించినట్లు బాధితుడు భాషా తెలిపారు. పైప్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. గ్యాస్ సిలండర్‌లో గ్యాస్ తక్కువ మోతాదులో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడడంతో వంట సామగ్రితో పాటు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపాడు.

ఆదోనిలో చైన్ స్నాచింగ్

మహిళ మెడపై కత్తి పెట్టి బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు లక్ష్మీ శ్వేత

ఆదోని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలో చైన్ స్నాచింగ్ జరిగింది. శుక్రవారం పట్టపగలే ఓ వ్యక్తి.. మహిళ మెడలో ఉన్న బంగారు చైన్ తెంపుకుని పరారయ్యాడు. ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలోనే ఈ చైన్ స్నాచింగ్ జరిగింది. వెంకన్న పేటకు చెందిన లక్ష్మీ శ్వేత (32) అనే మహిళ ఇంట్లో తన కుమారుడికి హోంవర్క్ చేయిస్తుండగా ఒక్కసారిగా దుండగుడు ఇంటిలోకి ప్రవేశించాడు. అతడ్ని మహిళ ప్రతిఘటించింది. దీంతో నిందితుడు కత్తి చూపించి అరిస్తే పొడిచేస్తానని బెదిరించి.... మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును దొంగలించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

డబ్బులు ఇస్తారా.. చంపాలా?

● పెద్దతుంబళం పెట్రోల్ బంకులో కర్ణాటక దొంగల హల్‌చల్
● బీరువా పగులగొట్టి నగదు దొంగలించిన వైనం
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ


పెట్రోలు బంకులో పనిచేస్తున్న వారిని విచారిస్తున్న డిఎస్పీ

ఆదోని రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళం పెట్రోల్ బంకులో దొంగలు హల్‌చల్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో బొలేరో వాహనంలో ఐదుగురు మాస్కులు ధరించి పెద్దతుంబళం శివారులో ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద చేరుకున్నారు. అక్కడ పనిచేస్తున్న ఈరన్న, తాయప్పలను మారణాయుధాలతో డబ్బులు ఇస్తారా చంపాలా అని బెదిరించారు. వారు ఎదురు తిరగడంతో వారిపై దాడి చేసి పెట్రోల్ బంకులో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.60వేల నగదును, రెండు సెల్‌ఫోన్లను తీసుకొని పరారయ్యారు. ఆదోని డీఎస్పీ హేమలత, రూరల్ సీఐ నల్లప్ప, ఎస్.ఐ మహేష్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ముఠా కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన వారిగా ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు.

ప్రభుత్వ గృహాల్లో అనధికార వ్యక్తుల నివాసం

● 507 మందికి నోటీసులు

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల గృహాల్లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. గత మూడు నెలల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేయగా దాదాపు 507 మంది ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ గృహాల్లో నివాసం ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు శుక్రవారం సి.క్యాంపులోని ప్రభుత్వ గృహాల్లో ఉంటున్న వారందరికీ సచివాలయ వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. అయితే నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన వీఆర్వోలపై కొందరు వ్యక్తులు ఖాళీ చేయబోమని చెబుతూనే దూషణలకు గిగినట్లు సమాచారం. ఈవిషయంపై తహసీల్దారు శివరామ్ వివరణ కోరగా గతంలో సి.క్యాంప్ ప్రభుత్వ గృహాల్లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని గుర్తించామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో వారందరికీ సచివాలయ వీఆర్వోల ద్వారా నోటీసులు అందజేస్తున్నామని చెప్పారు.

గౌరు దంపతులను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు


గౌరు దంపతులతో కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు

కల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలను తన స్వగృహంలో కలిశారు. గౌరు దంపతులు మాట్లాడుతూ ప్రజలు, రైతులకు సేవలు అందించాలని సూచించారు. గౌరు దంపతులను కలిసిన వారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినా థ్‌చౌదరి, జనరల్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు విక్రమ్, స్పోర్ట్స్ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం, లైబ్రరీ సెక్రటరీ సుధాకర్, కోశాధికారి చంద్రశేఖర్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగముని, ఎం.రవిరాజు, యనమల శ్రీనివాసులు, కాశీవిశ్వనాథ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

కర్నూలు అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహమ్మ దీయ వక్ఫ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం కేర్ టేకర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ హాజరై ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు చేస్తున్న ఎన్నో మంచి కార్యాక్రమాలు అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇబ్రహీం, రబ్బానీ, మహబూబ్, మునాఫ్, రమీజ్ పాల్గొన్నారు.

మంత్రి సేవలు అభినందనీయం: మంత్రి టీజీ భరత్ సేవలు అభినందనీయమని క్రెడాయ్ చైర్మన్ గోరంట్ల రమణ అన్నారు. శుక్రవారం మంత్రి చాంబర్లో బిల్డర్స్ అసోసియేషన్ (క్రెడాయ్) మంత్రితోపాటు కలెక్టర్ రంజిత్ బాషాను శాలువతో సన్మానించి పూల బోకే అందజేశారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ మర్యా దపూర్వకంగా కలిశామని తెలిపారు. కార్యక్రమంలో నూతన ప్రెసిడెంట్ జె. సురేష్ కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పి. గోవర్ధన్‌రెడ్డి, వైస్ ప్రసిడెంట్ కె. బ్రిజేష్ సింగ్, జాయింట్ సెక్రటరీలలు ఆర్ ఎస్ రెడ్డి, కేఈ పినాక పాణిగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు అందించండి మహాప్రభో..

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా తమకు జీతాలు ఇవ్వకుండా పస్తులు పెడుతున్నారని, అయితే.. పని భారం మాత్రం ఏ మాత్రం తగ్గించడం లేదని, ఇప్పటికైనా మార్క్‌ఫెడ్ సంస్థ తమకు వేతనాలు అందించాలని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 42 డీసీఎంఎస్ కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వేడుకుంటున్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ సంస్థ డీసీఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బంది ద్వారా రైతుల నుంచి కందులు శనగలు, మినుములు, జొన్నలు తదితర ఆహారోత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. గతంలో డీసీఎంఎస్ కేంద్రాలు ఉన్న ప్రాంతానికే రైతులు పంట ఉత్పత్తులను తీసుకువచ్చి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సలహా కేంద్రాల వద్దకు వెళ్లి రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఆదేశించారు. ఐదు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్న తాము సొంత ఖర్చులు పెట్టుకుని గ్రామాలకు ఏ విధంగా వెళ్లాలని ఉద్యోగులు ప్రశ్నిస్తు న్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

కోడుమూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో శనివారం విష్ణుసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు రాజు, నారాయణ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సచివాలయం వద్ద వైద్యులు ఉచితంగా ఈసీజీ, ఆర్‌బీఎస్, హిమోగ్లోబిన్, బీపీ, నేత్ర పరీక్షలు చేసి మందులు ఇస్తారని అన్నారు.

పశువులకు నీటితొట్ల ఏర్పాటుపై హర్షం

కల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో పశువులకు పొలాల్లో నీటితొట్లు ఏర్పాటు చేయాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయంపై కర్నూలు జిల్లా గొర్రెలు, మేకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎండా కాలంలో పశువులు, మూగజీవాలకు నీటి కొరత లేకుండా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నీటితొట్లు ఏర్పాటు చేసేలా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కురువ సంఘం నాయకుడు కె.వెంకటరాముడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నిరంతరం సాయం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు నిరంతరం సాయం చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. టీజీవీ, టీజీబీ తైక్వాండో అకడమిక్ చెందిన క్రీడాకారుడు విశ్వాసరావు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సాయ్ హాస్టల్ కర్నూలుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు మౌర్యఇన్‌లోని తమ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ క్రీడాకారున్ని అభినందించారు. అనంతరం టీజీ భరత్ తైక్వాండో క్రీడాకారునికి స్పోర్ట్స్ సైకిల్ కోసం నగదు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆనందరావు, తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు, అజయ్, చరణ్, తేజ వెంకటేశ్, మల్లేష్, హీరాలాల్ పాల్గొన్నారు.

పండుగ రోజుల్లోనూ పన్నులు చెల్లించవచ్చు: అడిషనల్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ఈ రెండు రోజుల్లోనూ ఆస్తి, తాగునీటి పన్నులను ప్రజలు చెల్లించవచ్చని కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆది, సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సైతం పన్నులు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా ప్రజలు ఇంటి నుంచే పన్నులను డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా చెల్లించవచ్చని తెలి పారు. వాట్సాప్ నెంబరు 9552300009, పురసేవ యాప్, వెబ్‌సైట్ Https://cdma.ap.gov.in/en/ptpaymentsలలో చెల్లించవచ్చని అదనపు కమిషనర్ తెలిపారు. అలాగే కల్లూరు వార్డు 85వ సచివాలయం, జేఎన్‌ఆర్ నగర్ (రైతుబజారు సమీపంలో) 62వ సచివాలయం, బాలాజీ నగర్ 104వ సచివాలయం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ భారం తగదు

● విద్యుత్ భవన్ ఎదుట సీపీఎం ధర్నా

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారం మోపడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలపై వేస్తున్న ట్రూఅప్, సర్దు బాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను నియంత్రించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఆదానీతో చేసుకున్న 17వేల కోట్ల సెకీ ఒప్పంద అవినీతి బాగోతం బట్టబయలైందన్నారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తుందంటే టీడీపీ ప్రభుత్వ భాగ స్వామ్యమెంత అని ఎద్దేవా చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో రూ.500 నుంచి రూ.1000 అదనపు


ఓర్వకల్లులో విద్యుత్ ఏఈకి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బిల్లులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శిదర్శి వర్గ సభ్యుడు టి.రాముడు, నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్, ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, గురుశేఖర్, సాయిబాబా పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి: సీపీఎం

ఓర్వకల్లు: ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ సునీల్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.32వేల కోట్లకుపైగా భారం వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, నాగరాజు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, హుశేన్, సురేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా పీ-4 విధానం అమలు


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫ రెన్స్ హాల్లో పేదరిక నిర్మూలనకు పీ-4 (ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం) విధానంపై స్టేక్ హోల్డర్లతో, ఇండస్ట్రీయల్ అసోసి యేషన్స్, చాంబర్ ఆఫ్ కామర్స్‌లతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదరికంలేని సమాజంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పీ-4 (పబ్లిక్-ప్రైవేటు-పీపుల్స్-పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ఉగాది రోజు ప్రారంభించనున్నారన్నారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పేదలకు అండగా నిలవాలనుకునే దాతలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై తగిన సహకారం అందజేయవచ్చని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్-స్వర్ణాం ధ్ర-2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తోందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీవో హిమ ప్రభాకర్‌రాజు, జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో రోగుల నుంచి అదనంగా డబ్బు లు వసూలు చేస్తున్న వాటిని అదుపు చేయలేకపోతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో పడకల స్థాయిని బట్టి రూ.30వేల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఓ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ రోగి నుంచి అదనంగా ఫోన్‌పే నుంచి డబ్బులు వసూలు చేసిన ఆ ఆస్పత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆరోగ్యశ్రీకి ఉచితంగా వైద్యం అందించా లని రోగులు నెట్‌వర్క్ హాస్పిటల్స్ యజమానాల్యను ప్రశ్నించగా.. అధికారులకు వాటా ఉందని చెబుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● **విజిలెన్స్ విచారణ జరిపించాలి:** ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులతో


మంత్రి టీజీ భరత్‌కు సమస్య విన్నవిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

విచారణ జరిపించాలని అఖిల భారత బీసీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకుడు బాలకృష్ణ మంత్రి టీజీ భరత్‌కు మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ప్రైవేటు నెట్‌వర్క్ హాస్పిటల్ యాజమాన్యాలతో లాలూచి పడి నెల నెలా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి, టీడీపీ జెండాను ఆవిష్కస్తామన్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తామన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో కెక్ కటింగ్, పార్టీ ప్రస్థానం, చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌ల నాయ కత్వంలో పార్టీని ముందుకు నడిపించే విధానం తదితర అంశాలు ఉంటాయన్నారు.

ఓర్వకల్లు: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రతి గ్రామంలో టీడీపీ జెండా రెపరెపలాడాలని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాల మేరకు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నాయకులు , కార్యకర్తలు జెండాలు ఎగురవేయాలన్నారు.

ఆప్కో మాజీ డైరెక్టర్ మృతి


పోలిశెట్టి నాగలక్ష్మయ్య(ఫైల్)

కల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆప్కో మాజీ డైరెక్టర్, కల్లూరు మాజీ సర్పంచు పోలిశెట్టి నాగలక్ష్మయ్య (74) శుక్రవారం మృతి చెం దారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం నాగ లక్ష్మయ్యకు కుటుంబ సభ్యులు హైద రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య వరలక్ష్మమ్మ, కొడుకులు రాజ్‌కుమార్, డాక్టర్ సతీష్, కూతురు సువర్ణ ఉన్నారు. పోలిశెట్టి నాగలక్ష్మయ్య 1997 నుంచి 1995 వరకు కల్లూరు మేజర్ గ్రామ పం చాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. అదేవిధంగా 25 సంవత్సరాలుగా ఆప్కో డైరెక్టర్‌గా పని చేశారు. శనివారం ఉదయం ఆయన స్వగృ హం నుంచి ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర ఉంటుందని కుటుంబ సభ్యులు రాజ్‌కుమమార్, డాక్టర్ సతీష్, కార్పొరేటర్ సానా శ్రీనివాసులు, అక్కెం విశ్వనాథ్ తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన


ప్రసంగిస్తున్న కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారి లక్ష్మీరాజ్యం

కర్నూలు లీగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం పర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారి వి.లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారికి పోక్సో చట్టం ద్వారా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమీలా, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ మనోహర్ రెడ్డి, అధ్యాపకులు భీమసేన, నాగమణి, రమాదేవి, సుశీలబాయి పాల్గొన్నారు.

మాలలను అణచివేస్తే చూస్తూ ఊరుకోం

కర్నూలు న్యూసిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మాలలను అణచి వేయాలని చూస్తే ఊరుకోమని.. వైసీపీ అధినేత జగన్ ఖబర్దార్ అంటూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పిడతల వెంకట స్వామి హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు బిర్లా కాంపౌండు జగ దీష్ మాల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఓటమి తరువాత మాలల జేఏసీ పేరుతో జగన్ పెయిడ్ ఆర్టిస్టులను తయారు చేసి ర్యాలీలు, సభలు పెడుతున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మాలలను దూరం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరిని కలిసి మాలలకు రావాల్సిన న్యాయబ ద్ధమైన రిజర్వేషన్ హక్కుల కోసం చర్చిస్తామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు జామల చిన్న సుంకన్న, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

జెమ్‌కేర్‌లో భుజం మార్పిడి ఆపరేషన్

కర్నూలు హాస్పిటల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొత్తబస్టాండు వద్ద ఉన్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో భుజం మార్పిడి ఆపరేషన్‌ను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిబాబు విజయవంతంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా గాజులపల్లెకు చెందిన 60 ఏళ్ల జయమ్మకు గత 6 నెలలుగా కీళ్లనొప్పులు అధికమై చేయిపైకి ఎత్తలేని స్థితికి చేరుకొంది. రోగి ఐదు రోజుల క్రితం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో చేరింది. డాక్టర్ రవిబాబు రోగికి పరీక్షలు చేయగా, కుడి భుజం ఎముకలు పూర్తిగా అరిగిపోయినట్లు నిర్ధారించారు. ఈ వ్యాధిని అంకలోసిర్గస్ అంటారని, దీనికి భుజం మార్పిడి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 24వ తేదీ రోగికి భుజం మార్పిడిలో కాంప్లెక్స్ ప్రొసిజర్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టిని నిర్వహించారు. దీంతో రోగి భుజం కదలిక వచ్చింది. ఆపరేషన్‌కు మత్తుమందు వైద్యులు అతిథి మాధవి పాల్గొన్నారు. రోగి కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆపరేషన్‌ను విజ యవంతంగా నిర్వహించిన డాక్టర్ రవిబాబును ఆస్పత్రి సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ అభినందించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

గూడూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం జులకల్లు గ్రామంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ అద్వర్యంలో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఏపీలో కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేసి రెండున్నర సంవత్సరాలైందన్నారు. పాత పద్ధతిలోనే హోంగార్డుల రిజర్వేషన్ కొనసాగించాలన్నారు. మంత్రి నారా లోకేశ్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ 6 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారని, అయితే 9 నెలలు అవుతున్నా హామీ నెరవేరలేదని అన్నా రు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు


నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు, కానిస్టేబుల్ అభ్యర్థులు

రాఘవేంద్ర, నాయకులు హుస్సేన్ బాషా, మహేష్, అంజి, నరేష్, రమేష్, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రన్ ఫర్ జీసస్‌ను విజయవంతం చేయాలని కోల్స్ చర్చి అధ్యక్షుడు అబ్రహం లింకన్ అన్నారు. ఈఎస్‌టీ కర్నూలు సిటీ పాస్టర్ సంఘం అన్ని సంఘాల సహకారంతో ఏప్రిల్ 19న రన్ ఫర్ జీసస్ ఉంటుందన్నారు. కోల్స్ చర్చి ఆవరణంలో రన్ ఫర్ జీసస్ పోస్టర్ విడుదల చేశారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ప్రాముఖ్యతను చైర్మన్ డా. ఆర్‌ఆర్‌డీ సజీవరాజు తెలిపారు. కన్వీనర్ దాసరి సుధీర్, కోల్స్ సంఘం కాపరులు జీవన్, అనిల్, సామేల్, షాలెం, దాసుబాబు విజయ్‌కుమార్, జయకుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన పెట్రోల్ బంకులో దొంగతనంతో కర్నూలు జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల వద్ద నేరాల నియం త్రణా చర్యలు చేపట్టారు. సంబంధిత పెట్రోల్ బంకు ఓనర్లకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలు జరగకుండా ఉండేందుకు శివారుప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా పటిష్టం చేశారు.

వీఆర్వోపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం గ్రామ రెవెన్యూ అధికారి టి.వెంకటేశ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వీలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోశాధికారి మౌలిబాషా అన్నారు. సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో వెంకటేశ్ విధుల్లో ఉండగా.. టీడీపీ కోడుమూరు నియోజకవర్గ యూత్ నాయకుడు సిటీ ఆదిత్య రెడ్డి దాడి చేశారు. బెళగల్ పరిధిలోని గ్రామ సర్వే.నెం.462/1బీ పొలానికి సంబంధించిన ఎలాంటి అర్జీ ఇవ్వకుండా ఖాతా.నెం.20001901లో ఉన్న మిగులు భూమి నాది అని, ఇంటి స్థలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వీఆర్వోను అనేక ఇబ్బందు లకు గురి చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్.సర్పరాజు, శ్రీధర్, రఫీ, బుద్ధకవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కేవీపీఎస్ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంసీ ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ముజఫర్‌నగర్ ఆటోస్టాండ్ సమీపంలో వార్డు అధ్యక్షుడు రామాంజ నేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐటీయూ నాయకుడు కె.సుధాకరప్ప హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మైనార్టీలపై దాడులు అధికమయ్యాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వడ్డెగేరి, కాంగ్రెస్ పార్టీ ఆఫీస్, పోస్టాఫీసు, ఎగ్జిబిషన్ గ్రౌండ్, వెంకటేష్ సినిమా థియేటర్ ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందన్నారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన

సి.బెళగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సైబర్ మోసాల నివారణపై హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజలకు సెల్‌ఫోన్లకు అప్రచిత వ్యక్తుల నుంచి వచ్చే మేస్‌జ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. ఈసమావేశంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల తనిఖీ


స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు హాస్పిటల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు శుక్రవారం తనిఖీ చేశారు. నగరంలోని లోటస్, సన్‌రైస్ హాస్పిటల్‌లోని స్కానింగ్ కేంద్రాల రెన్యువల్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను, రెఫరల్ స్లిప్స్‌లను పరిశీలించారు. వైద్యఆరోగ్య శాఖ నిబంధనలకు అనుగుణంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

శివానీ హాస్పిటల్‌పై డీఎంహెచ్‌వో ఆగ్రహం: నగరంలోని బుధవా రపేటలో ఉన్న శివానీ హాస్పిటల్ నిర్వహణపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి డీఎంహెచ్‌వో శివానీ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. హాస్పిటల్ డెలివరి రూం బాగా లేదని, ఆపరేషన్ థియేటర్ సరిగ్గా లేదని, రికార్డులు ఏ మాత్రం లేవని డీఎంహెచ్‌వో మండిపడ్డారు. హాస్పిటల్‌పై చాలా ఫిర్యాదులు ఉన్నాయనీ, లోపాలను సరిదిద్దుకోకపోతే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అనంతరం కొత్తబస్టాండు సమీపంలో ఉన్న మెడికవర్ హాస్పిటల్ స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట డెమో శ్రీనివాసుల శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు పద్మావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమ లత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బాబా బృందావన్ నగర్‌లో సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య నెలకొందన్నారు. కాలనీలో సిమెంట్లు రోడ్లు తవ్వడంతో వాహనాలు ఇంటి వద్దకు వచ్చే పరిస్థితి లేదన్నారు. కాలనీ ప్రతినిదులు జి.రామక్రిష్ణారెడ్డి, పర మేశ్వరయ్య, నాగరాజు, జనార్ధన్‌రెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, సీవీ.వర్మ పాల్గొన్నారు.

● పాతబస్తీలో తాగునీరు అందించడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు ఎస్‌ఎండీ షరీఫ్ అన్నారు. స్థానికులతో కలిసి కాలనీలో నిరసన తెలిపారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని బుధవారపేట, జొహరాపురం పరిసర ప్రాంతాల హంద్రీ నదిలో డ్రోన్ సాయంతో దోమల మందును పిచికారి చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి వార్డులోని మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయి స్తూ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో కలిసి దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎండ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వడదెబ్బ తగిలితే.. తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అప స్మారక స్థితి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బకు గురి అయిన వ్యక్తిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి చేర్చాలని సూచించారు.

ఆర్ఐవోను సస్పెండ్ చేయాలి


పత్తికొండలో ఆర్ఐవో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారి, కర్నూలు ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఆర్ఐవో దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన చేపట్టారు. దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. ఫీజులు కూడా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, వీటిని అరికట్టాల్సిన ఆర్ఐవో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భాషా, నజీర్‌బాషా, అల్తాఫ్, హుశేన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న న్యాక్ శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి ఉలుగన్న

ఆదోని అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ బీజీ ఉలుగన్న అన్నారు. శుక్రవా రం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో మూడు ప్రముఖ బహుళ జాతి కంపెనీ ప్రతినిదులు పాల్గొని 19 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో, నైపుణ్య అధికారి ఆనంద్ రాజ్ కుమార్, స్కిల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయితేజ, కో-ఆర్డినేటరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మద్దికెర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో వెలసిన బుగ్గ సంగమేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ ఈవో క్రిష్ణయ్య, ఇన్స్‌పెక్టర్ రాణి ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మూడు నెలలకు సంబంధించి లెక్కింపు చేయగా.. హుండీ ద్వారా 82,079లు, అన్నదానం హుండీ ద్వారా రూ.8,466 భక్తుల నుంచి వచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జయరామిరెడ్డి, లాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మంజునాథ్ స్వామి, సంపత్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ విజయకుమార్, నాయకులు

మద్దికెర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయనీ ఎస్ఐ విజయకుమార్ నాయక్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శుక్రవారం బురుజుల గ్రామంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దర్శి ప్రదీప్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, రంగస్వామి, క్రిష్ణ, కార్యదర్శి హరికృష్ణ, నిర్వాహకులు వీరేష్, కిషోర్, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్చంట్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున

ఆదోని అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండ తీవ్రత నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు దాతల సహకారం చాలా అవసరమని మర్చంట్ క్లబ్ అధ్యక్షుడు కురువ మల్లికార్జున అన్నారు. శుక్రవారం మర్చంట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మల్ థియేటర్ ప్రధాన రహదారిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మర్చంట్ క్లబ్ ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం రూ.14 లక్షలు

వెల్దుర్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి గ్రామపంచాయతీ వేలాలు ఈఓఆర్డీ రవికిశోర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్ నిర్వహించారు. పెద్ద మాంసపు అంగళ్లు రూ. 27 వేలు, జంతువధశాల రూ.1,69వేలు, రామళ్లకోట రోడ్డులో ఉన్న దుకాణాలు రూ.12,09600 మొత్తం దాదాపు రూ.14 లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చింది. సంతమార్కెట్ , సంతమార్కెట్ దుకాణములకు పాటదారులు రానందున 1వ తేదీకి వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకన్న, సర్పంచి శైలజ, ఉప సర్పంచి శ్వేత పాల్గొన్నారు.

గ్యాస్ లీకై.. త్రుటిలో తప్పిన ప్రమాదం

హొళగుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండల పరిధిలోని గజ్జెహల్లి గ్రామంలో శుక్రవారం బాషా అనే వ్యక్తికి చెందిన హోటల్‌లో ఉదయం 9 గంటల ప్రాంతంలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్‌కు ఉన్న పైప్ నుంచి గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించినట్లు బాధితుడు భాషా తెలిపారు. పైప్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. గ్యాస్ సిలండర్‌లో గ్యాస్ తక్కువ మోతాదులో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడడంతో వంట సామగ్రితో పాటు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపాడు.

పీఈటీ చెన్నబసప్పకు కాంస్య పతకం

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పెద్ద హోతూరు జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చెన్న బసప్ప ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని కాంస్య పతకం సాధించారు. శుక్రవారం ఆయనను హెచ్ఎం బాలేంధరరావు సిబ్బంది సన్మానించారు.

పాఠశాల సమీపంలోనే ఆస్పత్రి నిర్మించాలి


గ్రామసభలో చేతులెత్తిన మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

దేవనకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్‌లో గ్రామసభ దద్దరిలింది. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఎంపీడీవో సూర్యనారాయణ, పంచాయతి కార్యదర్శి రాముడు సమక్షంలో వైద్యశాల నిర్మాణం స్థల ఎంపిక కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ నెల చివరిలోగా పనులు మొదలు కాకపోతే నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో అందరికీ అనువైన చోటు జడ్పీ పాఠశాల సమీపంలో వైద్యశాల నిర్మాణం చేపట్టాలని గ్రామసభలో దాదాపు 350 మంది గ్రామస్తులు చేత్తులేత్తారు. పాత చోట ఎస్సీ కాలనీలో నిర్మాణం కోసం చేత్తులేమని అధికారులు కోరగా ఎవ్వరు స్పందించలేదు. అవాంచనీయ ఘటనలు జరగకుండా సీఐ వంశీనాథ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారులకు తలనొప్పిగా మారిన స్థల వివాదం : వైద్యశాల స్థల వివాదం అధికారులకు తలనొప్పిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కాలనీ సమీపంలో వైద్యశాల నిర్మాణం చేపట్టేందుకు గ్రామ సర్పంచు ప్రయత్నించారు. ప్రజలకు అనువుగా లేదని, రహదారి ఇరుకుగా ఉండటంతో రవాణా ఇబ్బందులు ఉంటాయాని గ్రామానికి చెందిన కూటమి నేతలు జడ్పీ పాఠశాల సమీపంలో జగనన్న కాలనీ వద్ద స్థలం చూపారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో జెసీ నవ్య, ఆర్డీవో భరత్ నాయక్‌లు గ్రామంలో పర్యటించి రెండు చోట్ల స్థల పరిశీలన చేశారు. సర్పంచు వైసీపీ నాయకులు పాత చోటే నిర్మాణం చేయాలని మొండికేశారు. గ్రామపంచాయతీ తీర్మానం ఇచ్చేందుకు ససేమిరా అనడంతో ఈ నెల చివరిలోగా తీర్మానం లేకపోతే వైద్యశాల నిధులు వెనక్కిపోయో ప్రమాదం ఉండటంతో , జెసీ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయంతో గ్రామసభ నిర్వహించారు.

దాతల ఔదార్యం..

● రూ.15 లక్షలతో నూతన రథం


సిద్ధమైన రథం

తుగ్గలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సీతారాముల ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి ఊరేగింపు చేసే రథం చిన్నదిగా ఉండడంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి దంపతుల ఔదార్యంతో సీతారాములకు రూ.15 లక్షలతో నూతన రథం చేయించారు. శుక్రవారం తుగ్గలిలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమిరోజు జరిగే కళ్యాణ, రథోత్సవాలకు తుగ్గలి నాగేంద్ర దంపతుల వారి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. వారు మాట్లాడుతూ వచ్చే నెల 6న జరిగే శ్రీరామనవమి వేడుకలకు సీతారాములకు అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహిచడంతో పాటు శిల్పిలతో తయారు చేసిన నూతన రథంలో సీతారాముల రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

అవిశ్వాస తీర్మానం తేదీ ఖరారు

ఆదోని టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ వాల్మీకి శాంతపై వైసీపీకి చెందిన 34 మంది వైసీపీకి చెందిన కౌన్సిలరులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన విషయం విదితమే. అవిశ్వాస తీర్మానానికి తేదీని ఖరారు చేస్తూ కలెకర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. ఏప్రిల్ నెలలో 16వ తేదీన ఉదయం 10-30 గంటలకు స్పెషల్ ఆఫీసర్ సబ్ కలెక్టర్ భరద్వాజ ఆధ్వర్యంలో బలపరీక్షను నిర్వహించాలని ఉత్తర్వులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తెలిపారు.

చెరువులను నింపాలి

ఆస్పరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాగు, సాగు నీటి కోసం ఏర్పాటు చేసి వెంగలాయి దొడ్డి, బిల్లేకల్, ముత్తుకూరు చెరువులలో స్థానికంగా ఉండే గ్రామాల చెరువులను నింపాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం బిలేకల్, కైరుప్పల గ్రామాలలో సచివాలయం మీదట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ క్రింద ఉన్న ఎడమ కాలమును పొడిగించి హోసూర్ నుండి పెద్దహుల్తి పొలాల మీదుగా దేవనబండ, చిన్నహుల్తి, జూటూరు, నలకదొడ్డి గ్రామాల మీదుగా బిలేకల్, వెంగళాయ దొడ్డి, చెరువుల వరకు పొడిగించి వేలాది ఎకరాలకు సాగునీరు గ్రామాలకు తాగునీరు కోరారు. కార్యక్రమంలో సీనప్ప, లక్ష్మన్న, శ్రీనివాసులు, రంగప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

రైల్వే బైపాస్‌కు సహకరించండి

చిప్పగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గుంతకల్ రైల్వే స్టేషన్ నుంచి చిప్పగిరి మండలం నంచర్ల మల్లప్ప గేటు వరకు కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రైల్ లైన్ నిర్మాణానికి స్థలాలిచ్చి సహకరించాలని రైతులను తహసీల్దార్ ఇజాజ అహ్మద్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ చిప్పగిరి, దౌల్తాపురం, నంచర్ల గ్రామాలకు చెందిన 34 ఎకరాల భూమిని, దాదాపు 48 మంది రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బైపాస్ రైల్వే బైపాస్ రైల్వే నిర్మాణానికి భూములు ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమని రైతులు ఊడదాల పెద్దన్న, కావాలి ప్రభాకర్ కావలి, బీ బాబు, కేదార్నాథ్ రెడ్డి, లక్ష్మన్న, కావలి చిన్న, ఓబుల నాయుడు తహసీల్దార్‌తో వాగ్వావాదం దిగారు. సారవంతమైన భూములు ఇవ్వలేమని తెగిసి చెప్పారు. రైతులు చెప్పిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, సర్వేయర్ నారాయణ ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం మంగళ ఆంజనేయ స్వామి ఆలయంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆలూరు పట్టణ అధ్యక్ష్యలుగా ఎం.శ్రీనివాసులు, హాలహర్వి మండలం గూళ్యం గ్రామ అధ్యక్షులుగా సోమేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు రామాంజినేయులు, నాయకులు ధనుంజయ్, సోమశేఖర్, నెట్టప్ప, గణేష్ పాల్గొన్నారు.

డబ్బాలను తొలగించాలి

ఆదోని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోనిలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయ్ కృష్ణ మాట్లాడుతూ ఆదోని మునిసిపాలిటీ పరిధిలో అనేక చోట్ల వందల సంఖ్యలో ఆర్టీసీ బస్టాండ్, బీసీ స్మశాన వాటిక స్థలం, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు, చిన్న మార్కెట్, తిమ్మారెడ్డి బస్ స్టాండ్ దగ్గర నుంచి ఆలూరు రోడ్ మహాయోగి లక్ష్మమ్మ ఆర్చి వరకు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాల్లో నిర్వహించి వాటి నుంచి కొంతమంది వ్యక్తులు బాడుగలను వసూలు చేస్తు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం కొంతమంది వ్యకుల చేతికి వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించం

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి వైసీపీ సర్పంచ్ ఎంపీపీలు అడ్డంకిగా మారితే సహించబోమని ఆలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. శుక్రవారం ఆలూరు పట్టణంలోని జనసేన పార్టీ రంజిత్ స్వగృహంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రూ. 40కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధికి సహకరించకపోతే సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చత్రపతి, శేకర్, బాషామున్న పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం నిర్వీర్యం చేస్తున్న అధికారులు

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సమాచార చట్టాన్ని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ ఆలూరు తాలూకా ఉపాధ్యక్షుడు బండారి నరసప్ప అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ హాళేబీడు గ్రామ పంచాయితీ 25-01-2025 తేదీన పౌర సమాచార అధికారి అయిన పంచాయితీ సెక్రటరీకు సమాచారం కోరినా ఆయన తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. మొదటిగా అప్పిలేట్ అథారిటీ అదికారి అయిన ఆలూరు ఎంపీడీవోకు ఈ నెల 5న సరైన సమాచారం ఇవ్వాలని కోరామన్నారు. హాళేబీడు గ్రామ పంచాయితీలో ప్రజల ధనాన్ని వృధా చేశారని ఆ విషయంపై సమాచార హక్కు ద్వారా వివరాలు అడిగితే ఎక్కడ బయటపడుతుందోనని తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

కురువలను గుర్తించడం హర్షణీయం


ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న కురువలు

ఆదోని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా కురువ మల్లయ్యకు కేటాయించడం హర్షణీయమని రాష్ట్ర కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. శుక్రవారం కర్నూలులో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని రాష్ట్ర కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, ఉదయ్ సన్మానించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడలా మృతి పట్ల ప్రభుత్వం విచారణ జరిపించాలని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆలూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు మారెన్నపాల్, శ్యాం బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సీఎస్ఐ చర్చి వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై క్రైస్తవులకు ఉన్న అనుమానాలు నివృత్తి చేయాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈనెల 25న రాజమండ్రి వద్ద పాస్టర్ ప్రవీణ్ రోడ్డు పక్కన చనిపోయి పడి ఉండడం పట్ల పలు అనుమానాలు ఉన్నాయాన్నారు. 31న ఆదోనిలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టరులు ఏసన్న, విజయ్, రాజేష్, పాల్, బేనోహర్ బాబు పాల్గొన్నారు.

పొలాలకు హంద్రీనీవా జలాలు అందడం లేదు


సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ , రైతు సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం వల్లే పంట పొలాలకు హంద్రీనీవా జలాలు అందడం లేదని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కారన్న అన్నారు. సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని హోసూరు, చిన్నహుల్తి,దేవనబండ, జూటూరు, నలకదొడ్డి గ్రామాల్లో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఉద్యోగులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం వర్షాధారంపై ఆధారపడి రైతులకు పంటలు సాగు చేస్తున్నారని, అయితే కళ్ల ఎదుటే హంద్రీనీవా జలాలు పక్క జిల్లాలకు తరలిపోతున్నా ఈ ప్రాంత రైతు పొలాలకు చుక్కనీరు అందడం లేదన్నారు. పందికోన రిజర్వాయర్ ఎడమ కాలువను పెద్దహుల్తి, హోసూరు పొలాల వద్ద కాలువ పనులు ఆగిపోయాయని, ఈ కాలువను పెద్దహుల్తి, చిన్నహుల్తి, దేవనబండ, అటికలగుండు, నలకదొడ్డి, జూటూరు గ్రామాలకు పొడిగించి కాలువ పనులు పూర్తి చేస్తే వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం స్పందించి పందికోన రిజర్వాయరు ఎడమ కాల్వ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు నెట్టికంటయ్య, వెంకట్రామిరెడ్డి, సిద్ధు, ఎంపీటీసీ వీరన్నఉరుకుందు, రాజప్ప, నాగిరెడ్డి, కారుమంచి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి


హొళగుందలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హొళగుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర బోర్డు అధికారులు ప్రభుత్వ భూములకు వేలం పాట నిర్వహించకుండా ఓ కాంట్రాక్టర్‌తో కలిసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, బీజే పొంపాపతి, రాజన్న, దిడ్డి వెంకటేష్, జాకీర్, మంజు, పీరన్న, వలి శుక్రవారం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ హొళగుందలోని ఎల్ఎల్‌సీ కాలువ 57వ డీపీ (డిస్ట్రిబ్యూషన్ పాయింట్) వద్ద ఉన్న ప్రభుత్వ మామిడి తోట, అలాగే సర్వే నెం 15/ఏ, 18/బిలో ఉన్న 11 ఎకరాల 86 సెంట్ల భూమిని ప్రతి ఏడాదికి ఒక్కసారి టీబీబీ అధికారులు వేలం పాటల ద్వారా లక్షల రూపాయలు ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేసేవారని అన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటివరకు వేలం పాటలు నిర్వహించడం లేదన్నారు. ఓ కాంట్రాక్టర్‌తో చేతులు కలిపి ఐదేళ్లలో సుమారు రూ. 20 లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్నారు. ఈ విషయంపై ఎల్ఎల్‌సీ కాలువ జేఈ నవ జీవన్ రెడ్డిని వివరణ కోరగా తాను విధులు చేరి సంవత్సరమవుతుందని తనకు ఈ విషయం తెలియదని, ప్రభుత్వానికి సంబంధించిన మామిడి తోట వేలం పాటల నోటిఫికేషన్ ఏప్రిల్ నెలలో వస్తుందని ఉన్నత అధికారులు తెలిపినట్లు తెలిపారు.

సమాచారం ఇవ్వడం లేదు

మద్దికెర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేస్తున్నారని మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రామూ యాదవ్, టీడీపీ నాయకులు రంగస్వామి, సురేష్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కార్యాలయానికి వెళ్లి మా పొలాలకు కొలతలు ఎప్పుడు వేస్తారని కోరగా.. సరైన సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులకు తెలియకుండా కొలతలు వేస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

హంద్రీ నీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

దేవనకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో హంద్రీ నీవా పెండింగ్ పనులను పూర్తి చేయాలని సీపీఎం అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్ మాట్లాడుతూ మండలంలో దాదాపు 47 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సిన హంద్రీనీవా కాలువ పనులు గత ఐదేళ్లుగా అడుగు పడలేదన్నారు. పంట కాలువలు నిర్మాణాలు జరగకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి గుండ్లకొండ వద్ద ప్రధాన కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల వినతిపత్రానికి సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆశోక్, కెపి రాముడు, నాగేష్, పొండు, నాగేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఆలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో స్యయద్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం పైపులైను లీకేజీ, మోటార్ల మరమ్మతులు త్వరతగతిని చేపట్టాలని అన్నారు. సమవేశంలో ఈవోపీఆర్డీ పై ప్రభాకర్ పంచాయతీ కార్యదర్శిలు విజయకుమార్, వెంకట నాయుడు, జిలాన్ బాషా, హుల్తెప్ప, ఉరుకుంద పాల్గొన్నారు.

నీటి కుంటలు పూర్తి చేయాలి

ఆలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద పొలాల్లో నీటి కుంటలను పూర్తి చేయాలి అని ఏపీడీ పక్కీరప్ప అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్‌జీయస్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జల సంరక్షణ కోసం ప్రభుత్వం పల్లె పుష్కరిణికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. గ్రామాల్లో కోనేరులు, పెద్ద బావులు, చెరువులను గుర్తించాలన్నారు. ఆలూరు మండలంలో 280 పంటలను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. సమవేశంలో ఏపీవో శ్రీనివాసులు, కోర్సు డైరెక్టర్ ప్రదీప్ నాయక్, ఈసీ మారన్న పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి అగ్నివీర్‌కు ఎంపిక


యువరాజ్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి యువరాజ్ ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థి యువరాజును కళాశాల యాజమాన్యం అభినందించారు.

వైసీపీ బూత్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బనగాని శ్రీను


బనగాని శ్రీనును సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బూత్ కమిటి రాష్ట్ర విభాగపు సంయుక్త కార్యదర్శిగా హోసూరు గ్రామానికి చెందిన బనగాని శ్రీనును అధిష్టానం ఎంపిక చేసింది. శుక్రవారం బనగాన శ్రీనును వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, సర్పంచులు రంగానాయక్, నాగప్ప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి

పత్తికొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కరెంటు ఆఫీసు ఎదుట ధర్నా చేశారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, దస్తగిరి మాట్లాడుతూ ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9 నెలల్లోనే మూడు సార్లు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రజా సంఘాల నాయకులు గోపాల్, కాశీ, రమేష్, నరసన్న, రాజు, రంగన్న, పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

హొళగుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని తోటి మిత్రులు రూ.41వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని మార్లమడికి గ్రామానికి చెందిన రామాంజి జడ్పీ ఉన్నత పాఠశాల హొళగుంద చెందిన 2006 పదో తరగతి బ్యాచ్‌కు చెందినవారు. మిత్రులు పెద్దహ్యాట మల్లయ్య, ముద్దటామాగి తిమ్మారెడ్డి, చిన్న మల్లయ్య, సుధా, ద్యావన్న శుక్రవారం కర్నూల్‌లోని ఓమెగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రామాంజిని, అత ని కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయాన్ని అందించారు.

రైతులకు న్యాయం చేస్తా


నబీ సాహెబ్

క్రిష్ణగిరి, మార్చి 28: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తానని ఆలంకొండ ఎస్.కే.నబీ సాహెబ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు టీడీపీ సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

పత్తికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ బార్‌అసోసియోషన్ ఎన్నికలలో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ ఎన్నికల్లో విజయం సాధించిన వారికి ఆయన అబినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, బార్ సభ్యులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరి చేరవని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూక రాజు తెలిపారు. శుక్రవారం ఆకస్మికంగా పెద్దతుంబళం పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో వైద్యులు ఆశాలత, ఎంపీహెచ్ఈవో వెంకటేశులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఉమెన్ ఫ్రెండ్లీ రాష్ట్ర పరిశీలకుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని పంచాయతీ భవనంలో వీఏఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ ఫ్రెండ్లీ రాష్ట్ర పరిశీలకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ గోనెగండ్ల మేజర్ పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైందన్నారు. ఈ గ్రామంలో మహిళలు ఏ విధంగా ఆర్థికంగా ఎదగాలి, ఎలా బలపడాలి అనే అంశాలపైన ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలుఇచ్చి మహిళలను ఆర్థికంగా బలపడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందజేస్తుందని తెలిపారు. రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వీఓఏలు మల్లేశ్వరి, సుజాత, శైలజ, జరినాబేగం, బోయ మునిస్వామి, కాజబందశ్రీను, కటికే మాబాషా, అక్బర్ పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంటుపై ఆరోపణలు తగవు'



డ్వామా పీడీని నిలదీస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఫీల్డ్ అసిస్టెంటు కృష్ణ ఎక్కువగా తప్పులు చేశారని ఆరోపించడం తగదని టీడీపీ నాయకులు యోబు, నరసింహ, హనుమంతు డ్వామా పీడీ వెంకటరమణయ్య ఒక్క మంత్రాలయంలోనే రూ. 97,625ల అవినీతి జరిగిందని చెప్పడం రాజకీయ కుట్రేనని ఆరోపించారు. గ్రామసభలో అంత అవినీతి చూపకుండా సోషల్ ఆడిట్‌కు వచ్చేసరికి మార్పు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయకక్షలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా: ఉపాధి హామీ పనుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా పత్రాలను ఏపీవో తిమ్మారెడ్డి, ఎంపీడీవో రాధకు శుక్రవారం అందజేశారు. వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో (ఫీల్డ్ అసిస్టెంట్లు రచ్చుమర్రి బొజ్జప్ప, బూదూరు లక్ష్మీనారాయణ రెడ్డి, వగరూరు గోవర్ధన్ రెడ్డి, చౌలహల్లి ఈరన్న, సుంకేశ్వరి సుధాకర్, చెట్నహల్లి దేవేంద్ర, చిలకలడోన రాగన్న, సింగరాజనహల్లి నాగవేణి) రాజీనామా చేస్తున్నట్లు పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై డ్వామా పీడీ వెంకటరమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. వారి రాజీనామాలను ఎంపీడీవో ఆమోదించి ఆయా గ్రామాల్లో కొత్తగా ఎనిమిది మంది నియామకానికి ప్రతిపాదనలు పంపిన వెంటనే నియామకాలు చేపడుతామన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి కారణంగానే ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు చేశారని చర్చించుకుంటున్నారు.

వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా గడ్డం

నందవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధికారి ప్రతినిధిగా గడ్డం నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గతంలో రైతుల కోసం అహర్నిశలు పని చేసి వారి తరపున పోరాటం చేసినందుకు అధిష్టానం గుర్తించి పదవిని ఆయనకు కట్టబెట్టారు. అధిష్టానం తనపై నమ్మకంగా ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని గడ్డం నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నందవరం పార్టీ కన్వీనర్ శివారెడ్డిగౌడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

రథానికి విరాళం



దాతను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

కౌతాళం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళిగనూరు గ్రామంలో తుంగాతీరాన వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా తయారు చేయిస్తున్న రథానికి శుక్రవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప రూ.21వేలను విరాళం అందజేశారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

వచ్చేనెల 15 వరకు ఎల్లెల్సీ నీటి విడుదల



గోనెగండ్లకు చేరిన ఎల్లెల్సీ నీరు

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎల్లెల్సీకింద సాగు, తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తుంగభద్ర డ్యామ్ నుంచి ఆంధ్రకు వచ్చేనెల 15 వరకు నీటి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. మొదట్లో మార్చి చివరి వరకు అని ప్రకటించారు. అయితే రైతులు సాగు చేసుకున్న పంటలు పూర్తిగా చేతికి అందాలంటే మరో 15 రోజులు అదనంగా విడుదల చేయాలని రైతులు, నాయకులు కోరడంతో ఇరిగేషన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 2నుంచి విడుదల అయ్యే నీరు పంట పొలాలకు కొంతమేరకు తగ్గించి ఆంధ్రబార్డర్ హోళగుంద, ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు సెక్షన్‌లలో ఉన్న నీటి కుంటలు, వాగులు, వంకలు, చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. డ్యామ్ నుంచి ప్రస్తుతం నీటి విడుదల తగ్గడంతో గోనెగండ్ల సెక్షన్‌కు శుక్రవారం కేవలం 26 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరింది. విడుదల అయిన నీటిని గోనెగండ్ల పొలాలకు వాడకుండా 26 క్యూసెక్కులకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మరో 40 క్యూసెక్కులను కలిపి మొత్తం 66 క్యూసెక్కులు కోడుమూరుకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

ఎండ వేడిమికి భక్తులు విలవిల

మంత్రాలయం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు ఎండవేడిమికి విలవిల లాడుతున్నారు. శుక్రవారం మంత్రాలయంలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటంతో ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా గ్రామస్థులు భక్తులు తమ గదుల నుంచి బయటకు రావడం లేదు. నిప్పులు కక్కుతున్న సూర్యుని ఎండవేడిమి, వడగాల్పులతో భక్తులు అల్లాడుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే మధ్వమార్గ్ కారిడార్, తుంగభద్రనది కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్,



ఎండవేడిమికి నిమ్మరసం తాగుతున్న భక్తులు



నిర్మానుష్యంగా ఉన్న రాఘవేంద్ర సర్కిల్

ప్రధాన రహదారులు, సంస్కృత వేదపాఠశాల కారిడార్ భక్తులు లేక నిర్మానుష్యంగా మారాయి. దర్శనానికి వెళ్లే భక్తులు గొడుగులు, టోపీలు, టవాల్, రుమాల్లు కప్పుకుని వెళ్తున్నారు. రోడ్డులో ఎక్కడ చల్లని పానీయాలు కనిపిస్తే చాలు పరుగులు పెడతారు. కొబ్బరిబోండాలు, గోలిసోడ, నిమ్మరసం, మజ్జిగ, లస్సీ తాగుతూ, ఐస్‌క్రీం, పుచ్చకాయలు తింటూ ఉపశమనం పొందుతున్నారు.

రచ్చుమర్రిలో సచివాలయం తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రాలయం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తనిఖీ చేశారు. అలాగే రచ్చుమరిలో గ్రామ సచివాలయం తనిఖీ చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో రాజకీయ గ్రహణం, మూతపడిన హెల్త్ సెంటర్లు అన్న కథనాన్ని ప్రచురించింది. దీనితో శుక్రవారం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల్లో తనిఖీలు చేశారు. రీసర్వే జరుగుతున్న విధానం, సచివాలయ భవనాలు, హెల్త్ సెంటర్లు, సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది పనితీరు పరిశీలించారు. రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్న వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.రవి, సర్వేయర్ డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, సర్వేయర్లు అశోక్, నవీన్ కుమార్, ఉరుకుందచారి, ధరణి,శేఖర్ నాయక్, భీరప్ప, హరి. తిమ్మేష్, భవిత, రాధారాణి, హరిత, శోభా, అనూష, హేమచంద్ర, నాగమణి పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి: సబ్ కలెక్టర్

నందవరం: గ్రామాల్లో ప్రజలకు, రైతులకు రీ సర్వే గురించి అవగాహన కల్పిస్తున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముగతిలో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు



రీసర్వే తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

చేసిన సభలో ప్రజలకు సబ్ కలెక్టర్ అవగాహన కల్పించారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రీ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, సర్వేయర్ ముగతి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి: సీపీఎం



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడు, లక్ష్మినరసయ్య, సురేష్, కృష్ణ, రమేష్ డిమాండ్ చేశారు. ఈనెల 8నుంచి 26వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహించారు. యాత్రలో ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, ఇళ్లస్థలాలు, టిడ్కో గృహాలు, రోడ్లు, పెన్షన్ల సమస్యలను తెలుసుకున్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో 1,35,000మంది జనాభా ఉన్నారని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా తాగునీటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నారన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలని డిమాండ్ చేశారు. చేనేతలు నేసిన వస్త్రాలను అమ్ముకునేందుకు ఎక్స్‌పోర్టు సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, కాలప్ప, కరే కృష్ణ, పులిరాజు, గుంటప్ప, లక్ష్మీదేవి, శివమ్మ, సరోజ, తిమ్మప్ప, వెంకటేష్ శెట్టి, శంకరన్న, బజారి, సుభాన్, పరమేష్ పాల్గొన్నారు.

నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నోటిని శుభ్రంగా ఉంచుకుంటేనే దేహానికి మంచి ఆరోగ్యమని డాక్టర్ రవళి తెలిపారు. శుక్రవారం ప్రపంచ నోటి ఆరోగ్య మాసోత్సవాలను పురస్కరించుకొని మండల పరిధిలోని పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దంతసంరక్షణ పద్ధతులు విద్యార్థులకు, రోగులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాలు ఏప్రిల్ 20వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సరదా..సరదా ఈత



నీటి ట్యాంక్‌లో ఈత కొడుతున్న పిల్లలు

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో పిల్లలు, మహిళలు ఉదయం 10 గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి. ప్రస్తుతం పిల్లలకు ఒంటిపూట బడి కావడంతో పిల్లలు నీటి కుంటలను, పంట పొలాల దగ్గర నిర్మించుకున్న ట్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. చల్లని నీటిలో మధ్యాహ్నం సరదా సరదాగా ఈత కొడుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉగాదికి ఆలయాలు ముస్తాబు



ముస్తాబైన ఆలయం

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాలు ఉగాది పర్వదినానికి ముస్తాబు అవుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సీతారామాంజినేయస్వామి దేవాలయం, చింతలాముని నల్లారెడ్డి దేవాలయం, శివాలయాలు, అమ్మవారి ఆలయాలను భక్తులు రంగులు, ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. రెండు రోజులుగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రా భిషేకాలు నిర్వహిస్తున్నారు. దైవనామస్మరణతో శైవదేవాలయాలు మార్మోగు తున్నాయి. గోనెగండ్లలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రభోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేపట్టారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

గోనెగండ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవిలో మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు చర్యలు తీసు కుంటున్నామని ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ అనంతశయన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో వారు పర్యటించారు. ప్రజలను తాగునీటి ఇబ్బందులను గురించి తెలుసుకున్నారు. నాలుగురోజులకు ఒక్క సారి నీరు వస్తుందని, అది కేవలం 45 నిమిషాలు మాత్రమే వస్తున్నాయని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తామని తాగునీటి సమస్యతో పాటు మిగతా సమస్యలు కూడా అడిగి తెలుసుకుంటామని తెలిపారు. పలు గ్రామాలలో ఉన్న నీటి కుంటలను, చెరువులను ఎల్లెల్సీ నీటితో నింపుతున్నామన్నారు. ఎల్లెల్సీ కాలువ నుంచి గోనెగండ్ల, అలువాల సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను నీటితో నింపివేశామని అన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

● రూ. 76.92 కోట్లతో ఉపాధి పనులు
● రికవరీ రూ. 4,28,021

నందవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో తూతూ మంత్రంగా సాగింది. సమావేశానికి కూలీలు, ప్రజల నుంచి స్పందన కరువైంది. కేవలం అధికారులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ 2023-2024 ఉపాధి పనులకు గాను 684 పనులను గుర్తించి అందుకు గాను రూ. 76.92 కోట్లను విడుదల చేశామన్నారు. అయితే అందులో పీఆర్ పనులకు గాను రూ. 4.47 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ నిధులతో 34 పనులు చేపట్టారు. పనులకు సంబంధించి రూ. 4,28,021 పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ సొమ్మును వెంటనే రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధిహామీ అడిషనల్ పీడీ మాధవీలత, డీవీవో లోకేశ్వరి, ఏపీడీ అల్లిపీర, ఎంపీడీవో పుల్లయ్య, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలంలో 2023-2024 ఏడాది ఉపాధి హామీ పనుల్లో రూ. 2.07 లక్షలు అవినీతి జరిగినట్లు డ్వామా పీడీ వెంకటరమణయ్య తెల్పారు. డీఆర్‌పీలు ఐదు రోజుల క్రితం గ్రామాల్లో తిరిగి చేసిన పనులను సర్వే చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సోషల్ ఆడిట్‌పై ఎంపీడీవో రాధ, ఏపీవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో 20 గ్రామ



మాట్లాడుతున్న పీడీ వెంకటరామణయ్య

పంచాయతీల్లో 1217 పనుల్లో 11.17 కోట్లతో పనులు పూర్తి చేశామని తెలిపారు. ఇందులో ఎన్ఆర్‌ఈజీఎస్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, ఎస్ఎస్‌పీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా మంత్రాలయంలో రూ.97,625, వి.తిమ్మాపురంలో రూ. 28,996లు, చిలకలడోనలో రూ.11,344లు, పరమాన్‌దొడ్డి తండాలో రూ. 18,577లు గుర్తించారు. మిగతా గ్రామాల్లో వేలల్లో, వందల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారు. రైతులకు రూ. 33వేల పెనాల్టీ విధించారు. అవినీతికి పాల్పడిన సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ పీడీ మాధవీలత, డీవోవీవీ లోకేశ్వర్, పంచాయతీరాజ్ నందవరం, మంత్రాలయం ఏఈలు నరసింహులు, మల్లయ్య, ఈసీ శ్రీనివాసులు, డీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం మాధవరం తన నివాసంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామేల్ పాల్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంఈవోలతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాల మౌలిక వసతులు, 117 జీవో రద్దు, పాఠశాల గదులు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో వచ్చే ఏడాది నుంచి ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణతలో ఫలితాలు రావాలని సూచించారు. పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. సమావేశంలో పెద్దకడబూరు ఎంఈఓలు సునేయం, రామ్మూర్తి, కోసిగి, మంత్రాలయం షైనొద్దీన్, కౌతాళం శోభారాణి, రామాంజనేయులు, హెచ్ఎం రామ్మోహన్, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘునాథ రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

మురుగు వదలొద్దు

మంత్రాలయం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో వ్యర్థ పదార్థాలు, మురుగునీరు వదలకుండా జాగ్రత్తలు తీసుకోవడం అందరి బాధ్యత అని సీడబ్ల్యూసీ అధికారులు నాగార్జున, మధుకళ్యాణ్ అన్నారు. శుక్రవారం మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గ్రామ కార్యదర్శి బీవీ నాగరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్షం-2025 ప్రచారంలో భాగంగా తుంగభద్ర నదిఒడ్డున పడేసిన పాతదుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి ట్రాక్టర్ ద్వారా డంప్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మన నదుల శుభ్రత, పర్యావరణంపై ప్రజలను ప్రోత్సహిం చడంపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సిబ్బంది పేక్షావలి, వేణుగోపాల్, రంగా, వెంకట్, లియాకత్ వలి తదితరులు పాల్గొన్నారు.

9న మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

ఎమ్మిగనూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన గోనెగండ్ల మండల పెద్దమరివీడు గ్రామానికి చెందిన రైతు కురువ మలయ్య వచ్చే నెల 9న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 47 మార్కెట్ కమిటీల ఛైర్మన్‌లను ప్రకటించింది. ఇందులో భాగంగానే ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కురువ మలయ్యను ప్రకటించింది. గతంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ సామాజిక వర్గంలోని కురువలకు అవకాశం వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఓసీ సామాజిక వర్గానికి కేటాయించింది. అయితే టీడీపీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తూ కురువ సామాజిక వర్గానికి చెందిన రైతు మల్లయ్యను ఎంపిక చేయటంపై బీసీ సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైస్‌ఛైర్మన్‌గా ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన వారిని ఎంపిక చేసినట్లు సమాచారం.

సీఎస్ఐ చర్చిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రైస్తవులు శిలువ ధ్యానాలు చేయడం హర్షనీయమన్నారు. అనంతరం విశ్వాసులకు భోజనం వడ్డించారు. డివిజినల్ ఛైర్మన్ వేదనాయకం, సంఘ నిర్వాహకులు యోబు, ఖయూన్, ప్రభుదాస్, దేవదాసు, సుధాకర్, కుమార్, టీడీపీ నాయకులు విజయరామిరెడ్డి, అండే హనుమంతు, సుంకప్ప, నరసింహులు, సుధాకర్, సోల్మాన్, డేవిడ్ పాల్గొన్నారు.

టీడీపీ వార్డు ఇన్‌చార్జి, కౌన్సిలర్ మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని ఐదోవార్డులో టీడీపీకి చెందిన వార్డు ఇన్‌చార్జి రంగస్వామి గౌడ్, ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్ అమాన్ మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వార్డులోని టీడీపీ జెండా కట్టాను సిద్ధం చేస్తుండగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ఒకరిపై ఒకరు దూషణల పర్వం కొనసాగించారు. వాగ్వాదం కాస్తా పెరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని చెప్పి పంపారు.